చంద్రబాబూ.. నోరు అదుపులో పెట్టుకో!

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి సూచన

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్‌పై, ప్రభుత్వంపై చంద్రబాబు అవాకులుచెవాకులు పేలడం సరికాదని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ పాలన తెలంగాణకు స్వర్ణయుగమని, ప్రపంచంలోని ప్రగతికాముకులు అందరూ అంగీకరించే సత్యమని చెప్పారు. ప్రజాప్రభుత్వంపై విమర్శలు చేయడం చంద్రబాబు అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమం దేశానికే ఆదర్శంగా నిలిచిన విషయాన్ని చంద్రబాబు గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. చంబ్రాబు తన రాజకీయ జీవితంలో ఓడిన ప్రతీసారి అహంకారం వల్లే ఓడిపోయారా? అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టు అయినప్పుడు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు చాలామంది సానుభూతి ప్రకటించారని, చంద్రబాబులా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయలేదని గుర్తు చేశారు. చంద్రబాబు నోరు అదుపులో పెట్టుకుంటే అందరికి మంచిదని సూచించారు.

కేసీఆర్‌ను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్తున్న సిబ్బంది. చిత్రంలో కేటీఆర్, సంతోషకుమార్, కవిత

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని మీడియాకు వివరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ

కేసీఆర్‌కు సర్జరీ విజయవంతం

మొదటిపేజీ తరువాయి...

ఆరోగ్యం కోసం అందరూ ఇంటి వద్దే ప్రార్థన చేయాలని కోరారు. నేతలు, అభిమానులు కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నదని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొనేందుకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, దానం నాగేందర్, జీవన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, ఫారుఖ్ హుస్సేన్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, రామచంద్ర నాయక్, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు దవాఖానకు వచ్చారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానా రెడ్డి కూడా యశోద దవఖానకు వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి శుక్రవారం యశోద దవాఖానకు వెళ్లి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: ప్రధాని

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పలువురు ఆకాంక్షించారు. కొందరు ట్వీట్ చేయగా, మరి కొందరు కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. కేసీఆర్ గాయపడిన విషయం తెలిసి బాధపడ్డానని, ఆయన త్వరగా కోలుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ ట్వీట్ చేశారు. కేసీఆర్ త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ప్రార్థిస్తున్నట్టు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ట్వీట్ చేశారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు తనకు వివరాలు అందజేయాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీని ఆదేశించారు. ఏపీ సీఎం జగన్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు కేటీఆర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. కేసీఆర్ కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, చంద్రబాబు, లోకేశ్, బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు, సినీ నటుడు చిరంజీవి ఆకాంక్షించారు.

లోకం పోకడ



మీ మాట విని సెల్‌ఫోన్‌ను ఓ నాలుగు నిమిషాలు దాచేశా డాక్టర్. మూర్ఛ వచ్చి పడిపోయాడు!

దివ్యాంగులకూ ఫ్రీ బస్ జర్నీ సౌకర్యం కల్పించాలి: వాసుదేవరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం దివ్యాంగులకూ వర్తింపజేయాలని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి కోరారు. ఈ విషయమై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో వెనుకబడి ఉన్న దివ్యాంగులను ఆదుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని వివరించారు. రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. 50 శాతం రాయితీ బస్‌పాస్ కలిగి ఉన్న దివ్యాంగులకు ఫ్రీ బస్ జర్నీ సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వానికి పెద్ద భారం కూడా పడదని పేర్కొన్నారు. మహిళల తోపాటు దివ్యాంగులకూ ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మానవీయ కోణంలో అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళలకు బస్సు ఉచితం

మొదటిపేజీ తరువాయి...

అధికారులు, ఉద్యోగులు హాజరవుతారని తెలిపారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు టీఎస్ఆర్టీసీ సిద్ధమైందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 40 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లతో ఈ పథకం అమలుపై శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహించామని వివరించారు. ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశమున్నందున, బస్‌స్టేషన్ల నిర్వహణపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఉచిత ప్రయాణంలో ప్రతి సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. గత రెండేండ్లుగా సిబ్బంది ప్రవర్తనలో మార్పు వచ్చిందని, దాని వల్లే సంస్థ రెవెన్యూ ఆదాయం పెరిగిందని గుర్తుచేశారు.

రోజుకు 7 కోట్లు నష్టం

రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ఆర్టీసీ 7,292 బస్సులను ఈ పథకానికి వాడుకోనున్నట్టు సజ్జనార్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో 40 శాతం మంది మహిళలు (దాదాపు 15 లక్షల మంది) నిత్యం ప్రయాణిస్తున్నారని, ఉచిత బస్సు ప్రయాణంతో 55 శాతం దాకా వెళ్లే అవకాశం ఉన్నదని వెల్లడించారు. దానికి అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని సర్వీసులు పెంచే అవకాశం ఉన్నదని వివరించారు. ఆర్టీసీకి రోజువారీగా రూ.14 కోట్ల ఆదాయం వస్తున్నదని, పథకం అమలైతే ఇది 50 శాతానికి తగ్గే అవకాశం ఉంటుందని, అంటే రోజుకు సంస్థపై రూ.7 కోట్ల భారం పడుతుందని అంచనా వేస్తున్నామని అన్నారు. ఈ తగ్గిన ఆదాయాన్ని రీయింబర్స్ చేస్తామని ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. రాబోయే రోజుల్లో 1,050 కొత్త బస్సులు తీసుకుంటున్నట్టు తెలిపారు. 1,000 ఎలక్ట్రిక్ బస్సులు మూడు నెలల్లో వస్తాయని, వీటిలో 500 హైదరాబాద్‌లో, మరో 500 జిల్లాలకు వస్తాయని వివరించారు. ఇప్పటికే బస్‌పాసులు రెన్యువల్ చేసుకున్న మహిళలు, విద్యార్థినులకు మాత్రం రీయింబర్స్‌మెంట్ ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ వీ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీటీఎం జీవన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు ఇవీ

- రాష్ట్రవ్యాప్తంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు.
- హైదరాబాద్‌లో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించవచ్చు.
- మహిళలకు వయసుతో సంబంధం లేదు.
- రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు.
- అంతరాష్ట్ర బస్సులకు తెలంగాణ సరిహద్దు పరిధి వరకు ఉచితం.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపించాలి.
- మొదటి వారం రోజులు గుర్తింపు కార్డులు లేకున్నా ప్రయాణించవచ్చు.

60 దాటితే ఎముకలు బలహీనం

- కాల్షియం, బోన్ డెన్సిటీ, స్ట్రెంత్‌లో తగ్గుదల
- తుంటి బాల్, కప్ దెబ్బ తింటే మార్పిడి మస్ట్
- ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ నగేశ్, రామ్‌నాథ్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 8 (నమస్తే తెలంగాణ): ప్రతి మనిషి వయసు పెరుగుతున్నా కొద్దీ శరీరంలో కాల్షియం తగ్గుతుంది.. ఫలితంగా ఎముకలు బలహీనపడటంతోపాటు పటుత్వం కోల్పోతాయని అంటున్నారు వైద్య నిపుణులు. 60 ఏండ్ల వయసు దాటితో ఎముకలు బలహీనమవుతాయని వారు పేర్కొంటున్నారు. తుంటి నొప్పి, తుంటి విరగడం వంటి సమస్యలకు రోగి వయసు, సమస్యకు గల కారణాల ఆధారంగా చికిత్స చేయాల్సి ఉంటుందని వారు చెప్తున్నారు. సాధారణ తుంటి నొప్పి సమస్యను 'హిప్ ప్రిజర్వేషన్' చికిత్సతో నివారించవచ్చునని ఆర్థో వైద్య నిపుణులు తెలిపారు. సమస్యను సకాలంలో గుర్తించకపోతే వ్యాధి ముదిరి తుంటి మార్పిడి శస్త్ర చికిత్సకు దారి తీసే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. సాధారణంగా తుంటి నొప్పి సమస్యకు పెయిన్‌కిల్లర్ మందులు, ఫిజియోథెరపీ రెండో స్టేజీలో కోర్ డి-కంప్రెషర్ వంటి చికిత్సలు నిర్వహిస్తారు. అప్పటికీ సమస్య తీరకపోతే తుంటి మార్పిడి శస్త్రచికిత్స జరపాల్సి ఉంటుందని వైద్యులు చెప్తున్నారు. అయితే సాధారణ చికిత్సకు అడ్వాన్స్‌డ్ చికిత్సగా 'హిప్ ప్రిజర్వేషన్'తో తుంటి సమస్యను పరిష్కరించవచ్చని వైద్యులు తేల్చి చెప్తున్నారు.

తుంటిని సంరక్షించడమే హిప్ ప్రిజర్వేషన్

తుంటి జాయింట్ అనేది బాల్, సాకెట్ రూపంలో ఉంటుంది. ఇది మనిషి కూర్చోవడం, నిలబడటం, పరుగెత్తడంపై కీలక పాత్ర పోషిస్తుంది. ఇంతటి ప్రాధాన్యమైన తుంటిని సంరక్షించుకోవాలంటే సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి 'హిప్ ప్రిజర్వేషన్' చికిత్స చేయించుకోవడం ఉత్తమం. హిప్ ప్రిజర్వేషన్ అంటే సమస్యను గుర్తించి ఏ కారణం చేత నొప్పి వచ్చిందో తెలుసుకొని ఆ భాగంలో ఉన్న ఎముకను సరిచేసి తుంటిని సంరక్షించడం. ఈ చికిత్స వల్ల సమస్యను అక్కడికక్కడే నిలవరించి నయం చేయవచ్చు. ఇది అన్ని వయసుల వారిలో సాధ్యం కాకపోవచ్చు. ముఖ్యంగా 50 నుంచి 60 ఏండ్లు పైబడిన వారిలో తుంటి ఎముక ఫ్రాక్చర్‌కు గురైతే సరిచేయడం సాధ్యం కాదు. వారిలో హిప్ రీప్లేస్‌మెంట్ ఒక్కటే మార్గం.

- డాక్టర్ రామ్‌నాథ్, ఉస్మానియా దవాఖాన రిటైర్డ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి

బలహీనతతోనే ఎముకల్లో ఫ్రాక్చర్స్

వయసు పెరిగిన కొద్దీ శరీరంలో కాల్షియం తగ్గడం, బోన్ డెన్సిటీ, బోన్ స్ట్రెంత్ వంటివి తగ్గుతాయి. అరవై ఏండ్లు దాటిన వారిలో సాధారణంగానే బోన్ ఫ్రాక్చర్స్ ఉంటాయి. వారిలో బోన్ క్వాలిటీ, ఆస్టిరోసిస్‌లో ఫ్రాక్చర్స్ సర్వసాధారణం. దీని వల్ల ఫ్రాక్చర్స్ ఏర్పడతాయి. 30 ఏండ్లలోపు వారికి హిప్ జాయింట్ ఫ్రాక్చర్ అయినప్పుడు స్క్రూస్‌తో ఫిక్స్ చేయవచ్చు. కానీ 50 లేదా 60 ఏండ్ల వయసు దాటిన వారిలో ఆ అవకాశం ఉండదు. వారికి తుంటి మార్పిడి ఒక్కటే శరణ్యం. కప్పు బాగానే ఉండి, బాల్ మాత్రమే దెబ్బతింటే హెమీ ఆర్థోప్లాస్టీ చేస్తారు. అదే బాలు, కప్పు రెండూ దెబ్బతింటే, లేదా రెండింటిలోనూ అరుగుదల ఉన్నప్పుడు హిప్ రీప్లేస్‌మెంట్ తప్పనిసరి. పెద్ద వయసు వారిలో ఎముకలు బలహీనపడి ఫ్రాక్చర్ అయితే హిప్ ట్రాన్స్‌ప్లాంట్ చేసి, బాల్, కప్ రెండింటినీ మారుస్తారు. వాటి స్థానంలో ఇంప్లాంట్స్ వేస్తారు.

- డాక్టర్ నగేశ్, ఆర్థో విభాగాధిపతి, నిమ్స్ దవాఖాన

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
మెదక్	12.9°c	25.7°c
రంగారెడ్డి	13.1°c	32.9°c
నిజామాబాద్	16.9°c	23.8°c
ఆదిలాబాద్	16.9°c	28.2°c
హైదరాబాద్	17.0°c	29.8°c
వరంగల్	19.0°c	28.0°c
ఖమ్మం	19.0°c	30.0°c
నల్లగొండ	19.0°c	31.9°c
కరీంనగర్	20.0°c	28.0°c
మహబూబ్‌నగర్	22.2°c	29.3°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్‌లో...

ప్రభుత్వ సంస్థ రైట్స్ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 34
- పోస్టులు: సైట్ ఇంజినీర్, సెక్షన్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ ఇంజినీర్ తదితరాలు
- దరఖాస్తు, చివరితేదీ తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- వెబ్‌సైట్: www.rites.com

ఐడీబీఐలో..

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ)లో స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 86
- పోస్టులు: మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డీజీఎం
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 25
- వెబ్‌సైట్: https://www.idbibank.in

మెడికల్ ఆఫీసర్లు

సెక్యూరిటీ పేపర్ మిల్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 5
- పోస్టులు: మెడికల్ ఆఫీసర్, కన్సల్టెంట్
- విభాగాలు: హోమియో, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 6
- వెబ్‌సైట్: http://spmnarmadapuram.spmcil.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, పాలిటీ (గ్రూప్స్, డీఎస్సీ) ఐఐటీ-నీట్ ఫిజిక్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

మరి మా బతుకుదెరువెట్ల?

- భరోసా ఇవ్వాలి.. ఆటోడ్రైవర్ల ఆవేదన
- నేడు ఎస్వీకేలో రౌండ్ టేబుల్ సమావేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలుచేస్తే ఆటో కార్మికుల బతుకుదెరువు ఎలా? అని తెలంగాణ ఆటో డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ ఆధారిత వాహనాలపై ఆధారపడి బతుకుబండిని లాగుతున్న డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని వాపోయారు. కాంగ్రెస్ ఆటో రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయడమో లేదా ఆటో కార్మికుల బతుకు దెరువుకు భరోసానివ్వడమో చేయాలని విన్నవించారు. అందులో భాగంగానే శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. సమావేశంలో యూనియన్ ముఖ్య నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఎస్సీ వర్గీకరణకు 19న చలో ఢిల్లీ

- టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ
- ఉస్మానియా యూనివర్సిటీలో ముఖ్య కార్యకర్తల సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 8: కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధించే దిశగా మాదిగలంతా సిద్ధం కావాలని, ఇందులో భాగంగా 19న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. హామీని నిలబెట్టుకోవడం ద్వారా బీజేపీ తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హితవు పలికారు. ఓయూ టెక్నాలజీ కాలేజీ ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వంగపల్లి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని మాట తప్పిన మోదీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు మాదిగలు లక్షలాదిగా తరలిరావాలని కోరారు.

మంత్రివర్గంలో మాదిగలకు స్థానం కల్పించాలి..

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా మాల సామాజికవర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క, మాదిగ కులానికి చెందిన దామోదర రాజనర్సింహను మంత్రిగా చేయడాన్ని స్వాగతించామని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు మంత్రివర్గ విస్తరణలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం

- తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన భేటీ
- సభ నిర్వహణ వ్యూహంపై చర్చ
- గన్‌పార్క్ వద్ద నివాళులు అర్పించనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర మూడో అసెంబ్లీ మొదటి సమావేశాలు ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. సభలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు సమావేశమై పార్టీ విధివిధానాలు, అభ్యర్థుల ప్రవర్తనా నియమావళి, సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చిస్తారు. అక్కడి నుంచి నేరుగా అసెంబ్లీ ముందు ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి, నివాళులు అర్పించి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగనున్నది. పార్టీ నుంచి గెలిచిన 39 మంది ఎమ్మెల్యేల్లో పార్టీ అధినేత కేసీఆర్ మినహా (కేసీఆర్ దవాఖానలో ఉన్నారు) అందరూ ఈ సమావేశానికి హాజరు కానున్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష నేతగా పార్టీ అధినేత కేసీఆరే ఉండాలని ఏకవాక్య తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. అలాగే పార్టీ విప్, పీఏసీ చైర్మన్ వంటి పదవులకు ఎవరిని నియమించాలనే అంశంపై కూడా చర్చ జరిగే అవకాశాలున్నాయి.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారంలో సాగవుతున్న వరి విత్తన పంట

దేశానికి తెలంగాణ విత్తనాలు

- ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 2 లక్షల ఎకరాల్లో విత్తనోత్పత్తి సాగు
- దేశంలో 40% వరకు మన విత్తనాలే
- విత్తనోత్పత్తితో రైతులకు భారీ లాభాలు
- రాష్ట్రాలతోపాటు విదేశాలకు ఎగుమతి

వరంగల్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): విత్తనాల ఉత్పత్తిలో తెలంగాణ గణనీయ పురోగతి సాధించింది. సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ ఖ్యాతి గడించింది. దేశంలో పంటల విత్తనాల్లో 40% వరకు మన రాష్ట్రానివే ఉన్నాయి. అన్ని పంటలకు కలిపి సగటున యేటా 44 లక్షల టన్నుల విత్తనాల ఉత్పత్తి తెలంగాణలో జరుగుతున్నది. మేలు రకం, ఎక్కువ ఉత్పత్తి వచ్చే విత్తనాల కోసం దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండును తెలంగాణ రైతాంగా అందిపుచ్చుకుంటున్నది. పుష్కలంగా సాగునీరు, నిరంతర కరెంటు సరఫరాతో విత్తన పంటల సాగు రాష్ట్రంలో ఏటేటా గణనీయంగా పెరుగుతున్నది. ఒక్క ఉమ్మడి వరంగల్‌లోనే 2 లక్షల ఎకరాల్లో సాగవుతున్నది. ఈ రకమైన విత్తనాలు తెలంగాణ నుంచే 50% వరకు ఉత్పత్తి అవుతున్నాయి. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో మన విత్తనాలతోనే పంటలు సాగవుతున్నాయి. చైనా, వియత్నాం, థాయిలాండ్, బంగ్లాదేశ్‌తోపాటు మరో పది దేశాలకు తెలంగాణ విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విత్తనాలను ఉత్పత్తి చేసే కంపెనీలు తెలంగాణలోనే కార్యకలాపాలు పెంచుతున్నాయి. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 62 కంపెనీలు విత్తనాలను ఉత్పత్తి చేయిస్తున్నాయి.

ఎకరాకు 40 వేల లాభం

సాధారణ వరి పంట సాగుతో రైతులకు పెట్టుబడి పోను ఎకరానికి 20 వేల వరకు మిగులుతాయి. అదే విత్తన వరి సాగుతో ఎకరాకు 40 వేలు, విత్తన మక్కజొన్నకు 30 వేల వరకు లాభం వస్తుంది. రైతులు ఏటా రూ.150 కోట్ల వరకు లాభపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (టీఎస్‌సీడ్స్) ఉత్పత్తి చేసే వరి విత్తనాలకు ఇతర ప్రాంతాల్లోనూ మంచి డిమాండ్ ఉన్నది. టీఎస్‌సీడ్స్ వరంగల్ యూనిట్ విత్తనాలకు మంచి పేరు ఉన్నది. టీఎస్‌సీడ్స్ వరంగల్ యూనిట్ ప్రతి ఏటా సగటున రూ.50 కోట్ల వరకు వ్యాపారం చేస్తున్నది. ఒక్క సీజన్‌లోనే 50 వేల కింటాళ్ల అమ్మకాలు జరుగుతున్నట్టు టీఎస్ఎస్‌డీసీ, వరంగల్ యూనిట్ రీజినల్ మేనేజర్ భయ్య రఘు తెలిపారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేతకు రెడీ

- 2009 డిసెంబర్ 9 నుంచి 2014 జూన్ 2 వరకు కేసుల వివరాలివ్వాలి
- పోలీస్‌శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం
- 2014లోనే 2,250 ఉద్యమ కేసులను ఎత్తివేసిన కేసీఆర్ నేతృత్వంలోని సర్కార్

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణవ్యాప్తంగా ఉద్యమ సమయంలో నమోదైన అన్ని కేసులను ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. 2009 డిసెంబర్ 9నుంచి 2014 జూన్ 2వ తేదీ వరకు నమోదైన అన్ని కేసుల వివరాలు, జ్యుడిషియల్ రిమాండ్ కేసుల వివరాలు ఇవ్వాలని పోలీసుశాఖను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై ఏమైనా సందేహాలు ఉంటే సీఐడీ ఇన్‌స్పెక్టర్లు నవీన్ బాబు, శేఖర్‌రెడ్డిను సంప్రదించాలని సూచించింది. కాగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టారు. ఒక్కో కేసుకు ఒక్కో జీవో తీసుకొచ్చి కేసులను ఎత్తివేశారు. రాష్ట్రం ఏర్పడే నాటికి మొత్తం 2,254 తెలంగాణ ఉద్యమ కేసులు నమోదైనట్టు పోలీసు రికార్డులు చెప్పాయి. నాడు కేసీఆర్ చర్యలతో 2,250 కేసులు పూర్తిగా ఎత్తివేయగా.. నాలుగు కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. వీటిలో రెండు రైల్వే కేసులు ఉన్నట్టు సమాచారం